సాక్షి జగిత్యాల

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



యూడైస్.. అక్రమాలకు చెక్

యూడైస్ ప్లస్.. విద్యా వ్యవస్థ సర్వ సమాచారాన్ని పొందుపరిచే ఓ వెబ్‌సైట్. అందులో నమోదయ్యే వివరాలు ప్రామాణికం.. నిర్వహణకు ఇదే మూలం. -8లో



జగిత్యాలలో ఐదిళ్లల్లో చోరీ

జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో బుధవారం అర్ధరాత్రి తాళం వేసిన ఐదు ఇళ్లల్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. -8లో

గరిష్టం/కనిష్టం
26.0/10.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. ఉదయం పొగమంచు కురుస్తుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చలి @ 9.4 డిగ్రీలు



చలిమంటలు కాగుతున్న ప్రజలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నాలుగైదురోజులుగా చలితీవ్రత పెరిగింది. వెల్గటూర్ మండలం గుల్లకోటలో 9.4 డిగ్రీలకు పడిపోయింది. ధర్మపురి మండలం నేరేళ్లలో 9.8 డిగ్రీలు, పెగడపల్లి 10.5, మల్యాలలో 10.6, మల్లాపూర్‌లో 10.7, గొల్లపల్లి, సారంగాపూర్‌లో 10.9 డిగ్రీలుగా నమోదైంది.

ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఇబ్రహీంపట్నం: ప్రతిఒక్కరూ ఓటు వేయాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటుపై అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన వారు ఓటర్‌గా నమోదుకు ప్రతి మూడునెలలకోమారు అవకాశముందని, బీఎల్‌వోల వద్ద ఫాం నింపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో నాటిన పండ్లమొక్కలు పరిశీలించారు. ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్, కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలకు స్వాగతం



అయోధ్య రాముడి అక్షింతలతో భక్తులు

జగిత్యాలటౌన్: అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతలకు జిల్లాకేంద్రంలో అపూర్వ స్వాగతం లభించింది. గీత గ్రంథాలయం నుంచి అక్షింతలు, కలశాలను తలపై ఎత్తుకుని శ్రీరామ సంకీర్తనలతో ఊరేగించారు. కోలాటాలు, భజనలతో మహిళలు పెద్ద ఎత్తున ఎదురెళ్లి స్వాగతం పలికారు. వచ్చేనెల 22న మందిరం ప్రారంభం కానున్న సందర్భంగా ఆరోజు ప్రాణప్రతిష్ట సమయంలో ప్రతిఇంటిలో అక్షింతలతో పూజ చేసుకోవాలని వీహెచ్‌పీ నాయకులు సూచించారు. అక్షింతలను ప్రతి గడపగడపకూ అందిస్తున్నామని వెల్లడించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ బుర్ర లోకేష్‌జీ, భీమనాతి శంకర్, ఎన్నమనేని అశోక్‌రావు, ఏసీఎస్ రాజు, అరవ లక్ష్మి, జిట్టవేణి అరుణ్ ఉన్నారు.

కోనరావుపేటకు ఆర్టీసీ బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

కోరుట్ల: కథలాపూర్ మండలకేంద్రం మీదుగా మెట్‌పల్లి మండలం కోనరావుపేటకు ఆర్టీసీ బస్సును గురువారం ప్రారంభించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, నయీం, మారు గంగారెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి సదరం స్లాట్ బుకింగ్

జగిత్యాల: సదరం సర్టిఫికెట్ కాలపరిమితి ముగిసిన వారికి.. కొత్త దివ్యాంగులను గుర్తించేందుకు సదరం శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు తెలిపారు. ఈనెల 22న మీసేవ కేంద్రాల్లో సదరం కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 27న ఆర్థోపెడిక్, 28న హియరింగ్, 29న ఎంఆర్ శిబిరాలు ఉంటాయని, మాతాశిశు ఆరోగ్యం కేంద్రంలో 30న విజువల్ నిర్వహిస్తామని వెల్లడించారు. అర్హతగల వారు స్లాట్ బుక్ చేసుకుని దాని రశీదుతోపాటు, ఆధార్‌కార్డు జిరాక్స్, కాలపరిమితి అయిపోయిన సర్టిఫికెట్స్ తీసుకోవాలని పేర్కొన్నారు. చెవిటి, మూగ వారు ఈఎన్‌టీ కోఠి ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకున్న బీఈఆర్‌ఏ, పీటీఏ రిపోర్ట్స్ తీసుకురావాలని సూచించారు.

మందుల షాపులపై నిఘా

- నార్కోటిక్స్ డ్రగ్స్ విక్రయించకుండాచర్యలు
- మెడికల్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు
- జిల్లాలో అనేక అక్రమాలు
- ప్రిస్క్రిప్షన్ లేకున్నా మందుల అమ్మకాలు

జగిత్యాల: మెడికల్ షాపుల్లో నార్కోటిక్స్ మందుల విక్రయాలపై డ్రగ్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. నార్కోడ్రగ్స్ విక్రయాలపై నిఘా పెట్టాలని ఔషధ నియంత్రణ శాఖ అధికారుల నుంచి ఆదేశాలు జారీ కావడంతో జిల్లా డ్రగ్ అధికారులు మెడికల్ షాపుల్లో తనిఖీలు చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులు, ఏజెన్సీల వారు నార్కోటిక్స్ డ్రగ్స్ అమ్మకుండా చర్యలు తీసుకుంటున్నారు. మత్తు కలిగించే ఈ ఔషధాలు ఒకవేళ కొనుగోలు చేస్తే ఎక్కడి నుంచి కొనుగోలు చేశారనే అంశాలకు సంబంధించిన బ్యాచ్ నంబర్లను రికార్డుల్లో పొందుపర్చాల్సి ఉంటుంది. వాటిని డ్రగ్ అధికారులు నిత్యం పరిశీలిస్తూ ఉండాలి.



జిల్లాకేంద్రంలోని ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రిస్క్రిప్షన్ లేకున్నా మందుల అమ్మకాలు

వైద్యుల సిఫారసు ఉంటేనే మెడికల్‌షాపుల్లో మందులు ఇవ్వాలని భారతీయ విద్యామండలి న్యాయస్థానం ఔషధ నియంత్రణ శాఖకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఔషధ నియంత్రణ శాఖ నిబంధనలు కఠినతరం చేసింది. నిద్రమాత్రలు, మత్తు కలిగించే దగ్గు టానిక్‌లు, మత్తుకు సంబంధించిన ఏ మందులు అయినా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిదే ఇవ్వకూడదు. కానీ జిల్లాలో కొందరు మెడికల్ షాపుల నిర్వాహకులు ఇష్టానుసారంగా మందులు విక్రయిస్తున్నారు.

నార్కోటిక్స్ మందులపై నిఘా

మెడికల్ షాపులపై డ్రగ్ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆరోపణలు వస్తున్నాయి. దీంతోపాటు కొన్ని మెడికల్ షాపుల్లో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నార్కోటిక్స్ డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే బ్రాండెడ్ పేరిట జనరిక్ మందులు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రూ.2కు వచ్చే గోలిని రూ.20 వరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

సిఫారసు కచ్చితంగా అవసరం

ఔషధ నిబంధనల ప్రకారం వైద్యుడి ప్రిస్క్రిప్షన్ ఉన్నప్పుడే మెడికల్‌షాపు నిర్వాహకులు మందులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా వ్యాధికి సంబంధించిన పేరు చెప్పగానే ఏదో ఒక మందును అంటగడుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పికి సైతం మందులు వారే ఇస్తున్నారు. వైద్యుడు వారం లేదా 15రోజుల వరకే మందులు రాస్తారు. అనంతరం మళ్లీ చూపించుకోవాల్సి ఉంటుంది. ప్రజలు అలా చేయకుండా మెడికల్ షాపునకు వెళ్తే మందులను ఇవ్వకూడదు. కానీ ఇస్తుండటంతో అవే వాడుతున్నారు. వైద్యులు రాసిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మందులు కొనుగోలు చేయాల్సి ఉంటుది. కానీ కొందరు తెలిసిన పేర్లు కొనుగోలు చేసి వాడుతుంటారు.

గ్రామీణ ప్రాంత ప్రజలే టార్గెట్?

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వొద్దని నిబంధనలు ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు. కొనుగోలు చేసిన మందులకు కచ్చితంగా రశీదులు ఇవ్వాల్సి ఉన్నా.. కొన్నిషాపులు పాటించడం లేదు. జిల్లాలోని 800వరకున్న మెడికల్ షాపులు, 100కుపైగా మెడికల్ ఏజెన్సీలు జనరిక్ మందులను సైతం బ్రాండెడ్ మందుల మాదిరిగానే అమ్ముతున్నాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వీటిని అంటగడుతున్నాయి. జనరిక్ మందులు చాలా తక్కువ ధరలో దొరుకుతాయి. ఇవి కూడా బ్రాండెడ్ అయినప్పటికీ వీటిని ఎక్కువ ధరలో ఇస్తున్నారు. బ్రాండెడ్ గోలి రూ.10 ఉంటే అదే బ్రాండెడ్‌కు సమానంగా రూ.2కే దొరుకుతుంది. కానీ ప్రజలకు తెలియకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. డ్రగ్ అధికారులు సైతం పర్యవేక్షణ లేదని ఆరోపణలున్నాయి.

ఫార్మసిస్టులు ఎక్కడ..?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి మెడికల్ షాపుల్లో లైసెన్స్ ఉన్న ఫార్మసిస్ట్ తప్పనిసరి. కానీ చాలా దుకాణాల్లో ఫార్మసిస్ట్‌లే కన్పించరు. వేరే వ్యక్తుల పేరిట లైసెన్స్ తీసుకుని షాపులు నిర్వహించడం కోకొల్లలు. మందుల కొనుగోళ్లు మూడో వ్యక్తి నుంచి కాకుండా అధీకృత డీలర్ నుంచి చేయాలి. దానికి సంబంధించిన ఇన్వాయిస్ నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఇవి ఎక్కడా అమలు కావడం లేదు. అమ్మకాలకు సంబంధించిన రశీదులు, ప్రిస్క్రిప్షన్, నిల్వ చేయాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్క మెడికల్ షాపుల్లోనూ ఇవి అమలు చేయరు. ఫిజిషియన్‌లు ఇచ్చే శాంపిల్ మందులు, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మందులను విక్రయించరాదు. కానీ జగిత్యాలలోని కొన్ని మెడికల్ షాపుల్లో వీటిని విక్రయిస్తున్నారు. డ్రగ్ అధికారుల నియంత్రణ లేకపోవడంతో వారి ఇష్టానుసారంగా మెడికల్ షాపుల నిర్వహణ కొనసాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

సూపర్‌మార్కెట్లలా మెడికల్‌షాపులు

మెడికల్ షాపులు సూపర్‌మార్కెట్లను తలపిస్తున్నాయి. మందులతోపాటు ఇతరత్రా వస్తువులు విక్రయిస్తున్నారు. డ్రగ్ అధికారుల నిబంధనల ప్రకారం మెడికల్ షాపుల్లో ఏ ఇతర వస్తువులు ఉండకూడదు. కానీ కొన్నిషాపుల వారు కిరాణంషాపు వస్తువులను విక్రయిస్తుండడం గమనార్హం.

అవగాహన లేకుంటే సమస్యలే...

- యాంటీబయటిక్ మందులు ఎంతటి మేలు చేస్తాయో అంతే అనర్థాలు కలిగిస్తాయి. అవగాహన లేకుండా పదేపదే మందులు వాడితే ఆరోగ్యానికి కొత్త జబ్బులు తెచ్చిపెడుతుంటాయి. అందుకోసమే వైద్యులు రాసిన మందులను తప్పకుండా వాడాల్సి ఉంటుంది.
- ఎక్కువగా గ్యాస్ట్రిక్, తలనొప్పి సమస్యతో బాధపడేవారు తలనొప్పికి మందులు వాడేటప్పుడు జాగ్రత్త తీసుకోవాలి. తలనొప్పి వస్తే కొందరు అసిక్లోఫినాడ్, లేదా పారాసిటమల్ వేసుకుంటారు. దీంతో గ్యాస్ట్రిక్ సమస్య ఎక్కువ అవుతుంది. ప్రజలు వీటిపై కొంత అవగాహన కల్పించాలి.
- అన్ని జ్వరాలు ఒకటి కానప్పటికీ కొందరు ఇష్టానుసారంగా జ్వరం వస్తే టాబ్లెట్స్ వాడుతుంటారు. జ్వరాల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివి ఉంటాయి. కొందరు ప్రజలు నేరుగా వెళ్లి పారాసిటమల్ కొనుక్కుని వేసుకుంటారు. దీంతో వ్యాధి తీవ్రత పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

మెడికల్‌షాపుల్లో తనిఖీలు

జిల్లాలోని మెడికల్‌షాపుల్లో డ్రగ్ అధికారులు తనిఖీలు చేశారు. జిల్లాకేంద్రంతోపాటు రాయికల్, మేడిపల్లి, కొడిమ్యాల, మల్యాలలో సోదాలు కొనసాగాయి. ఔషధ నియంత్రణ డైరెక్టర్ ఆఫ్ జనరల్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని మెడికల్ షాపులపై తనిఖీలు చేస్తున్నట్లు డ్రగ్ అధికారి ఉపేందర్ తెలిపారు. క్వాలిఫైడ్ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నార్కోటిక్స్ డ్రగ్స్ విక్రయించరాదన్నారు.


నిబంధనలు పాటించకపోతే చర్యలు



ప్రతి మెడికల్ షాపు నిర్వాహకులు నిబంధనలు పాటించాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేనిది మందులు ఇవ్వరాదు. ముఖ్యంగా నార్కోటిక్స్ మెడికల్ షాపులు ఏర్పాటు చేసినప్పుడు ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. కేసులు నమోదు చేస్తాం. శాంపిల్స్ విక్రయించరాదు. రికార్డుల నమోదు తప్పకుండా చేయాలి.

– ఉపేందర్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్

ముక్కోటికి ఏర్పాట్లు



- నృసింహాలయంలో ముమ్మరంగా పనులు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వాములు

ధర్మపురి: ఈనెల 23న ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ధర్మపురిలోని శ్రీలక్ష్మినృసింహాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాలు, సూచనల మేరకు భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా మున్సిపల్‌శాఖ, పోలీస్‌శాఖ సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, రాజగోపురాలకు విద్యుత్ లైట్లు, పూల అలంకరణ, వైకుంఠద్వారం ముస్తాబు, తాగునీటి వసతులు లడ్డూ, పులిహోర వంటివి అందుబాటులో ఉంచనున్నారు.

ముప్వూరు స్వాములకు ప్రత్యేక పూజలు

ప్రధాన ఆలయం ముందు భాగంగా ఉన్న ఉత్తర ద్వార దర్శనం కోసం ముక్కోటి వేదికను ఏర్పాటు చేస్తున్నారు. పుష్ప వేదికపై ముప్వూరు స్వాములైన యోగా, ఉగ్ర లక్ష్మినృసింహస్వాములతోపాటు శ్రీవేంకటేశ్వర స్వాములను ఆసీనులు చేసి వేద మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు జరిపిస్తారు. ఉదయం నాలుగు గంటలకు సహస్ర నామార్చనలు, మంత్రపుష్పాలు, వేదఘోష తదితర పూజలను నిర్వహిస్తారు. 5గంటలకు ధర్మపురి పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వాముల చేతులమీదుగా వైకుంఠ ఉత్తర ద్వారం తెరుస్తారు. ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులను పట్టణ పురవీధుల మీదుగా ఊరేగిస్తారు. కార్యక్రమానికి సచ్చిదానంద సరస్వతీ స్వామి, స్థానిక ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా తదితరులు హాజరుకానున్నారని పాలకవర్గం తెల్పింది.

ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ

ముక్కోటి ఏకాదశి వేడుకలను గురువారం సాయంత్రం జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు పరిశీలించారు. ఆలయంలో చేపడుతున్న పనులు, ఆలయం ముందువెనుక భాగంలో భక్తుల క్యూలైన్లు, గోదావరిలో స్నాన ఘట్టాలు, వాహనపార్కింగ్ స్థలాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. నందీ కూడలి నుంచి వాహనాలకు అనుమతి లేదని, జాతీయ రహదారి నుంచి ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా అనుమతి ఇస్తామని, పార్కింగ్‌కు సరిపడా స్థలాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. డీఎస్పీ వెంకటస్వామి, సీఐ రమణామూర్తి, ఎస్సై దత్తాత్రి ఉన్నారు.

లక్ష్యం చేరుకునేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న శ్రీకార్ సుధీర్

జగిత్యాలరూరల్: మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించడంలో లక్ష్యం చేరాలని అదనపు ప్రాజెక్ట్ అధికారి శ్రీకార్ సుధీర్ అన్నారు. గురువారం జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో అన్నపూర్ణ, అక్షర మండల సమైక్యలతో సమావేశం నిర్వహించారు. వచ్చే మార్చిలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా గ్రామ సమైక్యలు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు కోవిడ్ కొత్త వేరియంట్‌పై జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని పేర్కొన్నారు. క్రిమిసంహారక మందులు లేని వ్యవసాయ ఉత్పత్తులపై దృష్టి సారించాలన్నారు. నిర్మల్ జిల్లాలో అక్కడి మండల సమైక్యల ఆధ్వర్యంలో ఆర్గానిక్ వ్యవసాయం చేస్తూ లాభాలు గడిస్తున్నారని, జగిత్యాల మండల సమైక్య కూడా ఆర్గానిక్ వ్యవసాయంపై ఆలోచించాలన్నారు. అనంతరం క్రిస్మస్ పండగ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సెర్ప్ సూపరింటెండెంట్లు మాణిక్‌రెడ్డి, వెంకటేశ్, విజయభారతి, ఏపీఎం గంగాధర్, సీసీలు విద్యాసాగర్, గంగాధర్, మరియ, మంగ, అధ్యక్షురాలు సత్తవ్వ, గంగభవాని పాల్గొన్నారు.

బైపాస్‌లకు భూసేకరణ



హద్దురాళ్లను పెట్టి సర్వే చేస్తున్న సిబ్బంది

- మెట్‌పల్లి డివిజన్‌లో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది
- వచ్చే నెల 19లోపు పూర్తి చేయాలని ఆదేశం

మెట్‌పల్లి: జిల్లాలో బైపాస్ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. జాతీయ రహదారి(ఎన్‌హెచ్-63) మార్గంలోని పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి బైపాస్‌లు ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే ఇందుకు అవసరమైన భూముల సేకరణకు గత ఏప్రిల్‌లో అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. కోరుట్ల, మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో మొత్తం 31కిలోమీటర్ల మేర బైపాస్ నిర్మాణాన్ని ప్రతిపాదించిన అధికారులు.. ఇందుకు 305 ఎకరాల భూమి అవసరమని నిర్ణయించారు.

14నుంచి సర్వే ప్రారంభం

మెట్‌పల్లి డివిజన్‌లో బైపాస్‌కు సంబంధించిన భూ సేకరణకు ఈనెల 14 నుంచి రెవెన్యూ అధికారులు సర్వే ప్రక్రియను ప్రారంభించారు. మండలంలోని మేడిపల్లి (పడమర) నుంచి దీనిని ప్రారంభించారు. ఈ గ్రామంతోపాటు బండలింగాపూర్, వెల్లుల్ల, పెద్దాపూర్, చౌలమద్దితోపాటు కోరుట్ల డివిజన్‌లో యెఖీన్‌పూర్, సంగెం, వెంకటాపూర్, గుమ్లాపూర్, మోహన్‌రావుపేట, మేడిపల్లి(తూర్పు) గ్రామాల్లో సర్వే చేయనున్నారు. మెట్‌పల్లి డివిజన్‌లో వచ్చే నెల 19 లోపు దీనిని పూర్తి చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ డివిజన్‌లో 14 కిలోమీటర్లకు 144 ఎకరాలు, కోరుట్ల డివిజన్‌లో 16 కిలోమీటర్లకు 160 ఎకరాలు సేకరించనున్నారు.

రైతుల్లో ఆందోళన..

బైపాస్‌ల కోసం భూసేకరణ జరుగుతుండడంపై సంబంధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటి నిర్మాణం వల్ల విలువైన భూములు కోల్పోతున్నామని, ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలని మండల రైతులు ఇప్పటికే అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా బైపాస్‌ల ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టడం గమనార్హం.

రైతులు సహకరించాలి


ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బైపాస్‌లకు సంబంధించి భూ సేకరణకు సర్వే నిర్వహిస్తున్నాం. ఇది పూర్తయిన తర్వాత రైతుల వారీగా వివరాలు వెల్లడిస్తాం. సర్వేను పకడ్బందీగా చేపడుతున్నాం. దీనికి రైతులు సహకరించాలి.

– మధు, ఆర్డీవో, మెట్‌పల్లి

ఐసీడీఎస్‌లో ఇష్టారాజ్యం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ అంగన్‌వాడీ–2 కేంద్రం. ఇందులో మొత్తం 9 మంది చిన్నారుల సంఖ్య నమోదు ఉండగా.. గురువారం నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఆయా మాత్రమే హాజరై.. ఆమె వంటపనుల్లో నిమగ్నమై ఉంది. అంగన్‌వాడీ టీచర్ వచ్చిన కొద్దిసేపటికే బయటకు వెళ్లిపోయిందని అక్కడున్న వారి ద్వారా తెలిసింది.



ఇది మెట్‌పల్లి మండలం చెర్లకొండాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం. ఈ కేంద్రంలో చిన్నారుల సంఖ్య ఎనిమిది మంది. గురువారం ఒక్కరు మాత్రమే వచ్చారు. ఇక్కడా టీచర్ రాకపోవడంతో వచ్చిన ఒక్క పిల్లాడు ఇలా కూర్చుండిపోయాడు. కేవలం ఈ రెండు కేంద్రాలే కాదు జిల్లాలోని చాలా కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

- డుమ్మా కొడుతున్న సిబ్బంది
- అధ్వానంగా కేంద్రాల నిర్వహణ
- పూర్తిస్థాయిలో అందని పౌష్టికాహారం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మెట్‌పల్లిరూరల్: జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కేంద్రాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. సమయానుకూలంగా కేంద్రాలను తెరిచి పిల్లలకు పౌష్టికాహారం అందించడంతోపాటు వారికి ఆటపాటలతో బోధన చేయాల్సి ఉండగా.. చాలాచోట్ల ఈ ప్రక్రియ నామమాత్రంగానే జరుగుతోంది. కేంద్రాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చాలా కేంద్రాల్లో టీచర్లు రాకుంటే ఆయాలు చూసుకుంటున్నారు.

జిల్లాలో 1,065 కేంద్రాలు

జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 1,065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 1,037 ప్రధాన, 28 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల ద్వారా నిత్యం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సి ఉంటుంది. ఇందుకయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తోంది. అయితే కేంద్రాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చాలాచోట్ల టీచర్లు సక్రమంగా విధులు నిర్వహించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొన్నిచోట్ల ఆయాలే కేంద్రాలకు వచ్చిన వారికి సరుకులు అందిస్తున్నారు. మరికొన్నిచోట్ల పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది. పౌష్టికాహారం విషయంలో మెనూ పాటించాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదు. ఇటీవల మెట్‌పల్లి మండలంలో ఒకే రోజు మూడు కేంద్రాల్లో టీచర్లు లేకపోవడం, కేవలం ఆయాలతోనే కేంద్రాలు నిర్వహించడం, కొన్నిచోట్ల కేంద్రాలకు తాళాలకు వేసి ఉండడం గమనార్హం. అధికారుల అనుమతులు లేకుండా విధులకు డుమ్మా కొట్టడం, సమయపాలన పాటించకపోవడం, వచ్చిన కొద్దిసేపటికీ వెళ్లిపోవడం, సరుకులు సక్రమంగా అందించకపోవడం పరిపాటిగా మారిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడానికి వెనుకాడుతున్నారని తెలుస్తోంది. దీంతో చిన్నారుల హాజరుశాతం తక్కువగా నమోదవుతోంది.

కేంద్రాలను పర్యవేక్షిస్తున్నాం

అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. టీచర్లు కేంద్రాలకు రెగ్యూలర్‌గా వెళ్తున్నారు. టీచర్లకు ఆన్‌లైన్‌లోనే హాజరు నమోదు ఉంటుంది. దీనికి జీపీఎస్ అనుసంధానం కూడా ఉంటుంది. అందరూ వర్కింగ్‌లోనే ఉన్నారు.

– తిరుమలదేవి, సీడీపీవో, మెట్‌పల్లి ప్రాజెక్ట్

క్లుప్తంగా

అల్ఫోర్స్‌లో చండీ పారాయణం



పూజల్లో నరేందర్‌రెడ్డి దంపతులు

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామం అల్ఫోర్స్ సంస్థల ఆవరణలో గురువారం చండీ పారాయణం, సువాసినీల పూజాకార్యక్రమాలు వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.భక్తులు, వివిధ కళాశాల, పాఠశాలల ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి



పులి రాజయ్య (ఫైల్)

ధర్మారం: ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామానికి చెందిన పులి రాజయ్య (58) బుధవారం రాత్రి అనుమానాస్పస్థితిలో మృతిచెందినట్లు ధర్మారం ఎస్సై సత్యనారాయణ తెలిపా రు. ఎస్సై కథనం ప్రకారంగా.. పులి రాజయ్య మండలంలోని పత్తిపాక గ్రామ శివారులోని చెరువు వద్ద చేపల కాపలా ఉంటున్నాడు. చెరువు కాపలా ఉన్న సమయంలోనే అనారోగ్యానికి గురయ్యాడు. ఇంటికి చేరుకుని స్థానిక ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నాడు. ఈ క్రమంలో రాజయ్య ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో కుటుంబసభ్యులు మెరుగైన వైద్యంకోసం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించాడు. తన భర్త మరణంపై అనుమానం ఉందని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దూలం శ్యాం(28) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతకాలంగా కడుపునొప్పితో పాటు జాండీస్(పసుకలు)తో బాధపడుతుండగా ఆసుపత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి సునక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆసిఫ్ తెలిపారు. మృతుడు నిరుపేద కావడంతో సర్పంచ్ పంజాల అనూషసతీశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రూ.40వేలు విరాళాలు సేకరించి దాహన సంస్కరాలు నిర్వహించారు.

జీవితంపై విరక్తితో మరొకరు..



నరేశ్(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లి గ్రామానికి చెందిన ఎల్లరి నరేశ్(25) జీవితంపై విరక్తి చెందిన గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం .. ఎనిమిది నెలల క్రితం నరేశ్‌కు వివాహం కాగా.. భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తాగుడుకు బానిసై, జీవితంపై విరక్తి చెంది ఇంట్లో పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు చికిత్సకోసం ధర్మారం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించినట్లు బంధువులు తెలిపారు.

యూడైస్.. అక్రమాలకు చెక్

- వెబ్‌సైట్‌లో సమగ్ర సమాచారం
- పాఠశాలల నిర్వహణకు దోహదం
- హెచ్ఎంల ద్వారా శిక్షణ కార్యక్రమాలు



యూడైస్ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కరీంనగర్: యూడైస్ ప్లస్.. విద్యా వ్యవస్థ సర్వసమాచారాన్ని పొందుపరిచే ఓ వెబ్‌సైట్. అందులో నమోదయ్యే వివరాలు అత్యంత ప్రామాణికం. పాఠశాల నిర్వహణకు ఇదే మూలం. ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో జరిగే మార్పులు, చేర్పులపై పాఠశాలల నిర్వాహకులకు విద్యాశాఖ మార్గనిర్దేశనం చేస్తుంది. జిల్లాలో ఇటీవల ఎంఈవోలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ మొదలైంది. జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు మండలాల్లో జరుగుతున్న శిక్షణను పర్యవేక్షిస్తున్నారు.

- ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని రకాల ప్రభుత్వ యాజమాన్యాల్లో 674 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 41,004 కాగా యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్(యూడైస్ ప్లస్)లో పాఠశాల స్థాయిలో సమగ్ర సమాచారాన్ని పొందుపరుస్తున్నారు.
- దీని ఆధారంగా విద్యాశాఖ ప్రణాళికలు రూపొందించి, బడ్జెట్‌ను కేటాయించి అమలు చేస్తుంటారు. పాఠ్య, నోట్‌పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం పంపిణీ, వివిధ రకాల నిధులు వెబ్‌సైట్ ఆధారంగా కేటాయిస్తుంటారు.
- దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాల సూచిక కేటాయింపునకు వెబ్‌సైట్ సమాచారమే ప్రామాణికం. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి. దీంతో పాఠశాలల్లో జరిగే అవకతవకలకు చెక్ పడనుంది.
- 2021–22 వరకు యూడైస్ కొనసాగగా గత విద్యా సంవత్సరం నుంచి యూడైస్‌ప్లస్‌గా నవీకరించారు. ఏడాదికో మారు సమాచారం అప్‌డేట్ చేయగా ప్లస్‌లో మూడు గంటలకోమారు టెక్నాలజీ ఆధారంగా సమాచారం ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అవుతుంది. తద్వారా ఖచ్చితత్వం కనిపిస్తుంది.
- ఈ వెబ్‌సైట్‌ను మూడు భాగాలుగా విభజించారు. పాఠశాల భౌతిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మాడ్యుల్స్‌గా విభజించి సమాచారం పొందుపర్చనున్నారు. ఎంఈవోలు,హెచ్ఎంల నేతత్వంలో నిర్వహణ కొనసాగుతుంది.
- పాఠశాలకు క్రీడాస్థలం ఉందా, గదులు ఎన్ని ఉన్నాయి. ఇంకా ఏమేం అవసరం. ఫర్నిచర్, ల్యాబ్, ఇతరత్రా సదుపాయాలు ఉన్నాయా, అమలవుతున్న కార్యక్రమాలు.. తదితర అంశాలు వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నారు.
- వెబ్‌సైట్‌లో చేరిన నూతన అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా శిక్షణలు మొదలయ్యాయి. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఎంఈవో, పాఠశాల సముదాయం హెచ్ఎంలు, ఇతర ప్రధానోపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- ఈనెలలో శిక్షణలన్నీ పూర్తి చేసేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాస్థాయిలో ఎంఈవోలు, పాఠశాల సముదాయం హెచ్ఎంలకు శిక్షణ ముగిసింది. అన్ని పాఠశాలల హెచ్ఎంలకు మండలస్థాయిలో శిక్షణ అందిస్తున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



యూడైస్ ప్లస్‌లో సమగ్ర సమాచారాన్ని పాఠశాలల నిర్వాహకులు త్వరగా పొందుపర్చాలి. తద్వారా పాఠశాలల నిర్వహణ సులువుగా మారుతుంది. ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని స్టాటిస్టికల్ సమన్వయకర్తలను సంప్రదించాలి. కరీంనగర్ జిల్లా యూడైస్ సమాచారం పొందుపర్చడంలో టాప్–5లో నిలిచింది. యూడైస్ ప్లస్ ద్వారా పాఠశాలల సమగ్ర సమాచారం ఉండడంతో అక్రమాలకు తావు ఉండదు.

– జనార్దన్‌రావు, డీఈవో

ప్రభుత్వ భూముల కబ్జాపై బీజేపీ నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ అసెంబ్లీ పరిధిలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు గురువారం కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని తీగలగుట్టపల్లి, బొమ్మకల్, కొత్తపల్లి, బావుపేట, ఎలగందులతో పాటు పట్టణంలోని అనేక ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయంలో ప్రభుత్వ అండదండలతో ఆ పార్టీ నాయకులు కొందరు కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కబ్జా చేశారని అన్నారు. భూ కబ్జాలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మెతక వైఖరి ప్రదర్శిస్తుందని ప్రశ్నించారు. ప్రధానంగా సీతారాంపూర్ లోని 71 సర్వే నంబర్ ప్రభుత్వ భూమి అంశం వివాదాస్పదంగా మారినప్పటికీ నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా అలసత్వం వీడాలని, అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను రక్షించడానికి, భూ బకాసురుల నుంచి కరీంనగర్‌ను కాపాడేందుకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిలపు రమేశ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్‌చంద్ర, జానపట్ల స్వామి, సుధాకర్ పటేల్, ఎడమ సత్యనారాయణరెడ్డి, మీడియా కన్వీనర్ కటకం లోకేశ్, కార్పొరేటర్లు పెద్దపల్లి జితేందర్, కోలగాని శ్రీనివాస్, దురిశెట్టి అనుప్, చొప్పరి జయశ్రీ, నాగసముద్రం ప్రవీణ్, బండ రమణారెడ్డి, ఎన్నం ప్రకాశ్, మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, పాదం శివరాజ్, పురం హరి, లడ్డు ముందాడ, శ్రీనివాస్, అనిల్, బల్బీర్ సింగ్, రమణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి



ప్రాజెక్ట్‌ను వివరిస్తున్న విద్యార్థి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ఎస్సారార్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ సృజన టెక్‌ఫెస్ట్–2023 నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు హాజరై, ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. చీఫ్ గెస్ట్ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ జీఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ సృజన టెక్‌ఫెస్ట్ వంటి కార్యక్రమాలతో విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొదుతాయన్నారు. స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. విద్యార్థులకు ప్రయోగాత్మక జ్ఞానం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రాజెక్ట్‌లను జనవరిలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సృజన టెక్‌ఫెస్ట్‌కి ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎలక్ట్రికల్ విభాగంలో హుస్నాబాద్, టెక్స్‌టైల్ విభాగంలో అగ్రహారం పాలిటెక్నిక్ ప్రాజెక్ట్‌లు ఎంపికై నట్లు తెలిపారు. జిల్లాస్థాయి కో–ఆర్డినేటర్లు శ్రీదేవి, ప్రభాకరాచారి, దశరథం, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, నర్మద తదితరులు పాల్గొన్నారు.

అతి తక్కువ ధరకే సీటీ స్కాన్ సేవలు



సీటీ స్కాన్‌ను పరిశీలిస్తున్న బ్రియాన్ షియాన్

కరీంనగర్: అంతర్జాతీయ లయన్స్ సంస్థ సౌజన్యంతో కరీంనగర్‌లో స్థాపించిన రూ.2కోట్ల విలువ చేసే సీటీ స్కాన్ సేవలు పేద ప్రజలకు వరంగా మారనుందని పూర్వ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లయన్ బ్రియాన్ షియాన్ అన్నారు. గురువారం స్థానిక రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో 320జీ జిల్లా నేతృత్వంలో ఏర్పాటు చేసిన సీటీ స్కాన్‌ను లయన్ బ్రియాన్ షియాన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక 320జీ లయన్స్ సభ్యులు చేస్తున్న పలు అత్యవసర సమాజహిత సేవలు మంచి గుర్తింపు పొందాయని కొనియాడారు. అత్యంత ఖరీదైన సీటీ స్కాన్ సేవలను కేవలం రూ.800కే కరీంనగర్ ప్రజలకు అందుబాటులోకి తేవడం హర్షదాయకమన్నారు. 320జీ లయన్స్ చేస్తున్న కృషిని గుర్తించి ప్రాధాన్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషన్ ప్రత్యేక నిధుల్లోంచి రూ.2కోట్లు మంజూరు చేశామని, ఈ ప్రాంత రోగులకు ఇది ఎంతో మేలు చేస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రేకుర్తి లయన్స్ కంటి ఆసుపత్రిని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. నిరుపేద గ్రామీణ ప్రజలకు ఉచిత నేత్ర చికిత్సలు చేస్తూ ఎనలేని సేవలను అందించడం ముదావహమన్నారు. సహధర్మచారిణి లయన్ లోరి షియాన్‌తో కలిసి లయన్ బ్రియాన్ షియాన్ చేసిన సుడిగాలి పర్యటనలో వివిధ అంశాలను వివరిస్తూ జిల్లా గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి కార్యక్రమానికి ఓ రూపమిచ్చారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో నూతనంగా లయనిజంలో సభ్యత్వం తీసుకున్న సభ్యులకు గంప నాగేశ్వర్ ఉపదేశం చేసి లయన్ సభ్యులను ఉత్సాహపరిచారు. అంతర్జాతీయ లయన్స్ సంస్థ నాయకులు గట్టమనేని బాబురావు, ఆర్.సునీల్‌కుమార్, ఎస్.నరేందర్‌రెడ్డి, తీగల మోహన్‌రావు, విద్యాసాగర్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్వీరావు, ఎస్.కోదండరామ్, ఆర్.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ అక్రమాల నిందితుల అరెస్ట్

- హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు
- ఇంకా కొనసాగుతున్న విచారణ

జగిత్యాలక్రైం: జగిత్యాల వాణిజ్య పన్నుల శాఖ కా ర్యాలయంలో జరిగిన సుమారు రూ.283 కోట్ల జీఎ స్టీ అవినీతిని రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ అధికారులు బయటకు తీశారు. ఈనెల 14న స్థానిక కార్యాలయంలో తనిఖీలు చేపట్టి ఆధారాలు సేకరించిన అధికారులు.. అదేరోజు జగిత్యాలరూరల్ మండలం కండ్లపల్లికి చెందిన చందసాయిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడే పూ ర్తిస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు.. నిందితుడి నుంచి అక్రమాలు జరిగిన తీరును తెలుసుకున్నారు. నేరం చేసినట్లు నిందితుడు ఒప్పుకోవడంతో బుధవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని చంచల్‌గూడ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్లు సమాచారం. ఈ అక్రమాల్లో మరో ఉద్యోగి పాత్ర కూడా ఉండటంతో అసలై న ఆధారాలు సేకరించేందుకు రాష్ట్ర వాణిజ్యపన్ను ల శాఖ అధికారులు లోతైన విచారణ చేపడుతున్నారు.

జగిత్యాలలో ఐదిళ్లల్లో చోరీ



దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు



చిందరవందర చేసిన దొంగలు

- నాలుగున్నర తులాల బంగారం
- రూ.40 వేల నగదు అపహరణ



సీసీపుటేజీలో రికార్డు అయిన దొంగ

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో బుధవారం అర్ధరాత్రి తాళం వేసిన ఐదు ఇళ్లల్లో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన ఆకుల లావణ్య కొద్దికాలంగా బ్రాహ్మణవాడలో అద్దెకు ఉంటోంది. పనినిమిత్తం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లింది. ఆమె ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి తులంన్నర బంగారం, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారు. అదేవాడకు చెందిన రాపోలు రమాదేవి ఇంటికి తాళవేసి పక్కింట్లో నిద్రిస్తుండగా ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు మూడుతులాల బంగారం ఎత్తుకెళ్లారు. దొంగలు ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పగులగొట్టి వాటి రికార్డులు ఎత్తుకెళ్లడం గమనార్హం. విషయం తెలిసిన పట్టణ సీఐ నటేశ్ సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. పోలీసులకు సీసీ పుటేజీ దొరికిన దాంట్లో ఓ దొంగ కూడా రికార్డు అయ్యాడు. ఇద్దరు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన ముగ్గురికి మూడేళ్ల జైలు

సిరిసిల్లక్రైం: ఆర్టీసీ కాంట్రాక్ట్ డ్రైవర్‌ను కొట్టిన కేసులో లకావత్ రాంరెడ్డి, జె.సత్యనారాయణరావు, మాలోత్ మదన్‌లాల్‌కు మూడేళ్ల జైలుతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పునిచ్చారు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు. 2015, మే 11న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు వేతనాలు పెంచాలని నిరవధిక సమ్మె చేస్తున్నారు. అదే సమయంలో పెద్దలింగాపూర్‌కు చెందిన సల్లెంద్రి గోపి సిరిసిల్ల డిపోలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనితోపాటు అదే గ్రామానికి చెందిన ఎల్లవేణి రమేశ్ కూడా కాంట్రాక్ట్ కండక్టర్ పనిచేస్తున్నాడు. గోపీ డ్రైవర్‌గా ఎల్లవేణి రమేశ్ కండక్టర్‌గా ఇద్దరు కలిసి ఆర్టీసీ బస్సులో సికింద్రాబాద్ వెళ్లి తిరిగి వస్తున్నారు. అదే రోజు రాత్రి సిరిసిల్ల కొత్తబస్టాండ్ ముందు గల తెలుగుతల్లి విగ్రహం వద్ద బస్సులో సిరిసిల్ల ఆర్టీసీ డిపోకు చెందిన లకావత్ రాంరెడ్డి, జె.సత్యనారాయణరావు, మాలోత్ మదన్‌లాల్ ఎక్కి గోపిపై దాడి చేశారు. గోపి తలకు తీవ్రంగా గాయమైంది. కండక్టర్ రమేశ్ అడ్డుగా రావడంతో అతన్ని కొట్టారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి దాడికి పాల్పడిన లకావత్ రాంరెడ్డి, జె.సత్యనారాయణరావు, మాలోత్ మదన్‌లాల్‌కు మూడేళ్ల జైలుతోపాటు రూ.5వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎనగందుల నారాయణ తన ఆటోను నడుపుకుంటూ రోడ్డుపైకి వస్తున్న క్రమంలో రామగుండం వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఆటోలో ఉన్న నారాయణ కిందపడిపోపోగా తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు.

ఇంకెంత మంది బలవ్వాలి..

- ప్రాణాలను కబళిస్తున్న గుంతలరోడ్డు
- మరమ్మతులు చేసినా మూణ్నాళ్ల ముచ్చటే
- రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత
- యాక్సిడెంట్లు పెరిగినా కళ్లు తెరువని అధికారులు



ఇద్దరిని కబళించిన గుంతలు పడ్డ రోడ్డు

చొప్పదండి: ఇంటి నుంచి బయలుదేరి గమ్యస్థానం చేరక ముందే రోడ్డుపై ఉన్న గుంతల మూలంగా ఇద్దరు స్నేహితులు మృత్యువాత పడ్డారు. చొప్పదండి పట్టణంలో గురువారం జరిగిన ఘటన ఇక్కడి ప్రజలకు కొత్తేం కాదు. ప్రతీ నెలలో రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి, యువకులు, పెద్దలు బైక్‌పై ప్రయాణించే వారి మరణాలు పెరుగుతూనే ఉన్నాయి, అయినా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు శూన్యం. కొత్త రోడ్డు వేయడం దేవుడెరుగు, కనీసం ఉన్న రోడ్డును మరమ్మతు చేసే దిక్కు లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం రోడ్డుపై ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

పట్టణంలోని కరీంనగర్, రాయపట్నం ప్రధాన రహదారి గుంతలమయమై రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మరమ్మతులు చేసినా మూణ్నాళ్ల ముచ్చటే గుంతలరోడ్డు ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. పగలు, రాత్రి తేడా లేకుండా తరుచూ ప్రమాదాలు సంభవించి యువతను పొట్టన పెట్టుకుంటోంది. ఇంత జరుగుతున్నా రోడ్లు భవనాలశాఖ అధికారులు నష్ట నివారణ చర్యలు చేపట్టక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రమాదకరంగా బైక్ ప్రయాణం

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారే ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. సెంట్రల్ లైటింగ్ పనులు నడుస్తున్న క్రమంలో రోడ్డుకు ఇరువైపులా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణాలతో రోడ్డు ఇరుకుగా మారింది. రోడ్డుపై ఉన్న మట్టి సకాలంలో తొలగించకపోవడం వాహనదారులకు దినదిన గండమైంది. దీనికి తోడు కొన్ని నెలలుగా పట్టణంలో గుంతలు పడ్డ ప్రధాన బీటీరోడ్డును మరమ్మతు చేయలేదు. సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టిన నేపథ్యంలో బీటీ మరమ్మతు చేయక పోగా ఏడాదిగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. వందఅడుగుల రహదారి అభివృద్ధికాక ముందే కాంట్రాక్టర్ రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించడం ఇప్పుడు వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. అధికారులు రోడ్డు అభివృద్ధి కాకముందే డివైడర్ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం ప్రశ్నార్థకంగా మారింది. డివైడర్ వేసి రోడ్డును కుదించడం విమర్శలకు తావిస్తోంది.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

- పట్టణంలోని ఎస్‌బీఐ ఎదుట ఆర్అండ్‌బీ రోడ్డుపై జూన్ 12న జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మరణించారు. బైక్‌లపై వేగంగా వెళ్తూ అదుపుతప్పి మృత్యువాతపడ్డారు. ముగ్గురు యువకులు ఒక్కొక్కరేకావడం విషాదకరం.
- సెప్టెంబర్ 9న అదే ఎస్‌బీఐ ఎదుట బైక్ అదుపు తప్పి టిప్పర్‌ను ఢీకొన్న సంఘటనలో చికిత్స పొందుతూ ఒక పదిహేనేళ్ల యువకుడు మరణించాడు.
- సెప్టెంబర్ 17న మర్లవాడ సమీపంలో ప్రధాన రహదారిపై వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న పంచాయతీ కార్యదర్శి మృతిచెందాడు.
- సెప్టెంబర్ 29న కాంట సమీపంలో గుంతల మూలంగా బైక్ అదుపుతప్పి కిందపడటంతో చికిత్స పొందుతూ దత్తోజిపల్లికి చెందిన వెల్డర్ మృతి చెందాడు.
- డిసెంబర్ 21న సిద్ధార్థ స్కూల్ సమీపంలో గుంతలరోడ్డుపై కారు బైక్‌ను ఢీకొనడంతో నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు.

మల్లాపూర్‌లో విషాదం..

ధర్మారం: చొప్పదండిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందడంతో ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన పడిదం హరీశ్(21)అలియాస్ చింటు, కూతురు నగేశ్(20) బైక్‌పై మల్లాపూర్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా చొప్పదండి శివారులో ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

నిరుపేద కుటుంబం...

నిరుపేద కుటుంబానికి చెందిన నగేశ్ జీవనోపాధి కోసం కరీంనగర్‌లోని మొబైల్‌షాపులో పనిచేస్తున్నాడు. నగేశ్ తల్లిదండ్రులు మరణించటంతో అన్న మహేశ్ వద్ద ఉంటున్నాడు. హరీశ్ తండ్రి మేస్త్రీ పనిచేస్తుండగా హరీశ్ కూలీపనికి వెళ్తుండేవాడని గ్రామస్తులు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకుల మృతి అందరిని కంటతడిపెట్టించింది.

ప్రతిభకు పట్టం.. మేధస్సుకు పదును..

- ఆకట్టుకున్న అల్ఫోర్స్ మ్యాథ్స్ మెజెస్టి



ప్రదర్శన తిలకిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన అల్ఫోర్స్ మ్యాథ్స్ మెజెస్టి ఆకట్టుకుంది. మేధస్సుకు పదును పెడుతూ విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ప్రతిభకు పట్టం కట్టాయి. ఈ ప్రదర్శనలో భాగంగా మ్యాజిక్ మ్యాట్రిక్స్, రోబో సర్కిల్, క్యూబ్ బిల్డింగ్ వంటి నమూనాలు ఆలోచింపజేశాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ ప్రదర్శనను ప్రారంభించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రామానుజన్ దేశానికే ఆదర్శప్రాయుడని, నేటి తరానికి గొప్ప మార్గదర్శకులని కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు గణిత దినోత్సవం

శ్రీశ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి యజమాని కృష్ణారావు హైదరాబాద్‌లో ఉంటూ ఇక్కడికి తరచూ వచ్చి వెళ్తుంటాడు. ఇటీవల తన స్నేహితులు వేములవాడకు రాగా వారికి తన ఇంటిని అప్పగించాడు. వారు తిరిగి వెళ్లిన తర్వాత గురువారం ఉదయం ఇంటికొచ్చిన కృష్ణారావుకు తలుపులు తీసి ఉండి కనిపించాయి. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో ఉన్న 4 తులాల బంగారంతోపాటు సుమారు 2కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేములవాడటౌన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.